సాక్షి పెద్దపల్లి

ఆదివారం ׀ 20 ׀ ఆగస్టు ׀ 2023



సేవలు అందేదెప్పుడో..?

పల్లె ప్రజలకు స్థానికంగానే పారదర్శకవంత మైన సేవలు అందించేందుకు వీలుగా రూపొందించిన ఈ–పంచాయతీ సేవలు అందడం లేదు.

8లో



ఆత్మస్థైర్యానికి జూడో దోహదం

ప్రస్తుతకాలంలో విద్యార్థుల ఆత్మస్థైర్యానికి జూడో క్రీడ దోహదపడుతుందని కలెక్టర్ బి.గోపి అన్నారు.

8లో

గరిష్టం/కనిష్టం
26.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

‘ధరణి’ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



తహసీల్దార్లతో సమావేశమైన కలెక్టర్

పెద్దపల్లిరూరల్: ధరణి సమస్యలపై అందిన దరఖాస్తుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పథకాల అమలుపై పలు సూచనలు చేశారు. ప్రతిరోజు మండలస్థాయిలో 10 ధరణి దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశించారు. గృహలక్ష్మి పథకం కింద జిల్లాలో 32,290 దరఖాస్తులు అందగా ఇప్పటివరకు 22 వేల ధ్రువీకరణ పూర్తి చేశామన్నారు. జీఓ 59 కింద దరఖాస్తు చేసుకున్న వారినుంచి రుసుం వసూలు చేయాలన్నారు. జిల్లాలో అర్హులైన పేదల కోసం 11 ఎకరాల్లో 442 ఇంటి పట్టాలను సిద్ధం చేయగా.. ఇప్పటివరకు 132 మంది లబ్ధిదారులకు అందించామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్, మంథని ఆర్డీఓ హనుమానాయక్, తహసీల్దార్లు, కలెక్టరేట్ ఈ–సెక్షన్ సూపరింటెండెంట్ పుష్పలత పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



సన్నాహక సదస్సులో జడ్జిలు, పోలీసులు

గోదావరిఖనిటౌన్: రాజీ కుదుర్చుకునే వీలున్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా చూడాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా అదనపు న్యాయస్థానంలో జరిగిన లోక్ అదాలత్ సన్నాహక సదస్సులో మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలో పెండింగ్ కేసులు పెరగకుండా పోలీసులు కృషి చేయాలన్నారు. గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి ఆర్.రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గణేష్, పోలీస్‌లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలి



ప్రవీణ్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

సుల్తానాబాద్: ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలని పారిశ్రామికవేత్త చీకోటి ప్రవీణ్ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రానికి వెళ్తూ సుల్తానాబాద్‌లో ఆగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైశ్యులు రాజకీయంగా ఎదగాలని, అప్పుడే సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత రాణిస్తారని అన్నారు. తనకు రాజకీయాల్లోకి రావాలని ఉందని, సుల్తానాబాద్ వేదికగా త్వరలోనే ఆర్యవైశ్యులతో సమావేశం నిర్వహించి రాజకీయ చైతన్యసదస్సును ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముందుగా ఆయనను నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లా రైస్ ఇండస్ట్రీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నగునూరి అశోక్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, సత్యనారాయణ, ప్రసాద్, రాజన్న, వెంకన్న ఉన్నారు.

‘ముసురు’కుంది

- అత్యధికంగా రామగిరిలో 71 మి.మీ
- అత్యల్పంగా అంతర్గాంలో 45మి.మీ
- ఆరుతడి పంటలకు జీవం

సుల్తానాబాద్: జిల్లాలో వర్షం ముసురుకుంది. శుక్రవారం నుంచి చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. అత్యధికంగా రామగిరి 71మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా తరువాత ఎలిగేడులో 64, కమాన్‌పూర్‌లో 62.9 మి.మీ వర్షపాతం నమోదైంది. అతితక్కువగా అంతర్గాంలో 45మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.

ఆరుతడి పంటలకు జీవం

జిల్లాలో పత్తిని 57,451 ఎకరాలు, మొక్కజొన్న 461, వేరుశనగ 401, పొద్దు తిరుగుడు 231 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ముసురు వానలతో ఆరుతడి పంటలకు మేలు జరిగినట్లయ్యింది. 25 రోజుల క్రితం భారీ వర్షం కురిసి ఆగిపోయింది. అప్పటినుంచి వర్షాల జాడలేకపోవడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. బావులు, బోర్ల కింది రైతులు పంటలకు నీరందించి పంటలను కాపాడుకున్నారు. వరుణుడు కరుణించడంతో పంటలకు జీవం పోసినట్టయింది. ఈ వర్షంతో పంటలకు నష్టం లేదని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. భారీ వర్షం కురిస్తే మాత్రం మానేరు వాగు, చెరువులు, విద్యుత్ స్తంభాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండొద్దని సుల్తానాబాద్ తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి కోరారు.

ఎవరి కుర్చీ పదిలం..!?

- పాత జిల్లా బీఆర్‌ఎస్‌లో మారనున్న సమీకరణాలు
- వేములవాడ, ధర్మపురి, కోరుట్లలో మార్పు అనివార్యం
- పెద్దపల్లి జిల్లా అభ్యర్థులందరిపైనా నేతల అసంతృప్తి
- కరీంనగర్‌లోనూ కొన్నిచోట్ల రావాల్సిన స్పష్టత
- తుదిజాబితా కోసం పార్టీలో మొదలైన ఉత్కంఠ



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ల కేటాయింపు తలనొప్పిగా తయారైంది. సొంత పార్టీలో అసమ్మతి నేతలు వేర్వేరు కుంపట్లు పెట్టి సిట్టింగ్‌లకు సీట్లు ఇస్తే సహకరించేది లేదని, తమలో ఒకరికి ఇస్తే కలిసి పనిచేస్తామని అధిష్టానానికి సంకేతాలు పంపుతున్నారు. రోజుకో నియోజకవర్గంలో అసమ్మతివాదుల సంఖ్య పెరుగుతుండడం.. ఏకంగా పార్టీ కార్యాలయాలు ఓపెన్ చేయడం, శుభ, అశుభ కార్యక్రమాలకు వెళ్తూ ప్రజలతో మమేకమవుతుండడంతో క్షేత్రస్థాయి క్యాడర్ అయోమయానికి గురవుతోంది. పార్టీ అధిష్టానం నుంచి రెండు, మూడు రోజుల్లో మొదటి విడత జాబితా వస్తుందంటూ వస్తున్న సంకేతాలతో ఉన్న సీటు ఉంటదా..? ఊడుతుందా..? అనే సందిగ్ధంలో ప్రస్తుత ఎమ్మెల్యేలు ఉన్నారు. ద్వితీయశ్రేణి నాయకులు మాత్రం టికెట్ తమకే అంటూ ఎవరి స్టైల్‌లో వారు నియోజకవర్గకేంద్రాలు, మండలాల్లో పర్యటిస్తున్నారు. మరోవైపు పార్టీలో జరుగుతున్న తతంగంపై పార్టీ అధిష్టానం ఒకింత దృష్టి సారిస్తూనే అసమ్మతివాదులను బుజ్జగిస్తూ.. వివాదాలు లేకుండా చేసే ప్రయత్నంలో ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సీట్ల కేటాయింపు విషయానికి వస్తే వేములవాడ, రామగుండం, మంథని, పెద్దపల్లి, చొప్పదండి తదితర నియోజకవర్గాలలో సొంత పార్టీ నుంచే తీవ్ర అసమ్మతిని ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇది సీట్ల కేటాయింపులో పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారిందని చెప్పవచ్చు.

కరీంనగర్ జిల్లా...

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను మార్చాల్సిందేనంటూ ఆ నియోజకవర్గానికి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులు ఇటీవల కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో సమావేశమై ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలోనే తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. వారి అసమ్మతిని చల్లార్చేందుకు మంత్రి గంగుల మంతనాలు జరుపుతున్నారు. అక్కడి నుంచే టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య సొంత పార్టీలోనే రోజురోజుకూ పెరుగుతోంది. మాజీ ఆర్డీవో బైరం పద్మయ్య, కరీంనగర్ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, కత్తెరపాక కొండయ్య, బండపల్లి యాదగిరి, గంట కళ్యాణి శ్రీనివాస్ పార్టీ అధిష్టానం వద్ద అభ్యర్థనలు పెట్టుకుని ప్రచారం చేసుకుంటున్నారు.
- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు టికెట్ ఖాయమనే ప్రచారం జరుగుతున్నా మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఓరుగంటి ఆనంద్ పార్టీ అధిష్టానం వద్ద ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం.
- హుజూరాబాద్ సీటు కేటాయింపు విషయంలో గతంలోనే జమ్మికుంటలో జరిగిన బహిరంగ సభలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు తదితరులు ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డికి టికెట్ ఖాయమని సంకేతాలు ఇచ్చారు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న వొడితెల సతీష్‌బాబు సైతం హుజూరాబాద్ నుంచి పోటీ చేసే విషయంలో ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. హుస్నాబాద్ సీటును పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయిస్తే సతీష్‌బాబు హుజూరాబాద్‌కు రావడం ఖాయమనే ప్రచారం జరుగుతోంది. కానీ ఇటీవలే అక్కడి పార్టీ నేతలు పొనగంటి మల్లయ్య, తుమ్మేటి సమ్మిరెడ్డి అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. అక్కడి నుంచే ఇటీవల పోటీ చేసి ఓడిపోయిన పర్యాటక సంస్థ అభివృద్ధి చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ సతీమణిని సైతం బరిలో దించే అవకాశాలను అధిష్టానం పరిశీలిస్తున్నట్లు సమాచారం.
- కరీంనగర్ ఎమ్మెల్యేగా ఉన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ మరోసారి టికెట్ దక్కించుకుని నాలుగో సారి ఎమ్మెల్యేగా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పార్టీలో అసమ్మతి ఏమీ లేకపోవడంతో టికెట్ ఖాయమనే ప్రచారం జరుగుతోంది.

జగిత్యాల జిల్లా...

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు టికెట్ కేటాయించే విషయంపై పార్టీలో కొంత అసమ్మతి నెలకొంది. టీఆర్‌ఎస్ సీనియర్ నేతలు ఓరుగంటి రమణారావు, పి.జితేందర్‌రావులు టికెట్ కోసం పార్టీ అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.
- కోరుట్ల ఎమ్మెల్యేగా ఉన్న విద్యాసాగర్‌రావు అభ్యర్థిత్వాన్ని వీలైతే మార్చి అతని కుమారుడు డాక్టర్ సంజయ్‌ని బరిలో దింపే అవకాశాలపై పార్టీ అధిష్టానం దృష్టి సారించింది.
- ధర్మపురి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ప్రస్తుత ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పార్టీ అధిష్టానం తాను కోరుకుంటే తప్ప అభ్యర్థిత్వాన్ని మార్చబోదని సమాచారం. పెద్దపల్లి ఎంపీగా కొప్పుల ఈశ్వర్ అభ్యర్థిత్వాన్ని పార్టీ పరిశీలిస్తే ధర్మపురిలో ఎమ్మెల్యే అభ్యర్థి మారే అవకాశాలు ఉండనున్నాయి.

సిరిసిల్ల జిల్లా...

- వేములవాడ ఎమ్మెల్యేగా ఉన్న చెన్నమనేని రమేశ్ అభ్యర్థిత్వం ఈసారి మార్పు తప్పదంటూ పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. పౌరసత్వ వివాదం తేలకపోవడం.. ప్రజలకు అందుబాటులో ఉండరనే ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి గతంలో బీఆర్‌ఎస్‌లో చేరిన చల్మెడ లక్ష్మీనరసింహారావుకు టికెట్ కేటాయింపు ఉంటుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ మేరకు పార్టీ అధిష్టానం సూచనతోనే ఎన్నికల కార్యాలయం ఓపెన్ చేసి ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నారు. ఆ ప్రాంతానికి చెందిన ఏనుగు మనోహర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ డాక్టర్ గోలి మోహన్ కూడా పార్టీ అధిష్టానం వద్ద తన పేరు పరిశీలించాలని కోరుతున్నట్లు సమాచారం.
- సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు టికెట్ ఖాయం. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పేరిట జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ మరోసారి విజయఢంకా మోగించేందుకు తనదైన శైలిలో ప్రచారపర్వంలో దూసుకుపోతున్నారు.

పెద్దపల్లి జిల్లాలో...

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు టికెట్ ఇస్తే సహకరించేది లేదని ఏకంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు నియోజకవర్గకేంద్రంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా అసమ్మతివాదులంతా ఏకమై పోటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, మాజీ మేయర్ కొంకటి లక్ష్మినారాయణ, బొగ్గుగని కార్మిక సంఘం నేత మిర్యాల రాజిరెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వేరుకుంపటి తయారు చేసి తమ పనిలో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యేగా ఉన్న కోరుకంటి చందర్ ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడిగానూ కొనసాగుతున్నారు. తాజాగా బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కౌశిక హరిని శుక్రవారం హైదరాబాద్ తీసుకెళ్లి ప్రగతిభవన్‌లో పార్టీ అధిష్టానంతో మాట్లాడించడంతో హరి చేరిక ఖాయమైంది. ఈ పరిణామంతో రామగుండం రాజకీయం రసకందాయంలో పడింది.
- మంథని నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు టికెట్ కేటాయించవద్దని ఇటీవలే ఆ ప్రాంత మాజీ ప్రజాప్రతినిధులు నాగినేని జగన్‌మోహన్‌రావు, మైదం భారతివరప్రసాద్, బందం వసంతరెడ్డి తదితరులు తేల్చిచెప్పడంతో పార్టీ అధిష్టానం మంథనిపై ఫోకస్ పెట్టింది. కాటారం మాజీ జెడ్పీటీసీ చల్ల నారాయణరెడ్డి సైతం టికెట్ రేస్‌లో ఉన్నట్లు వినికిడి. జెడ్పీ చైర్మన్‌గా ఉన్న పుట్ట మధు మాజీ ఎమ్మెల్యే కావడం.. పార్టీలో బలమైన నాయకుడు కావడంతో టికెట్ ఆయనకే దక్కే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.
- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి మరోసారి టికెట్ కేటాయింపు వద్దని మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య నిరసన వ్యక్తం చేసి ఏకంగా పార్టీకి గుడ్‌బై చెప్పారు. వారంతా ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. నల్ల మనోహర్ రెడ్డి, బొద్దుల లక్ష్మణ్ సైతం పార్టీ అధిష్టానం వద్ద తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరినట్లు వినికిడి. నియోజకవర్గవ్యాప్తంగా ఎమ్మెల్యే తీరుపై సొంత పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా.. టికెట్ కేటాయింపు వ్యవహారం ఎటు దారి తీస్తుందో వేచిచూడాల్సిందే.

రాజిరెడ్డి మరణంపై మౌనం వీడని మావోయిస్టులు

- అసలు విషయం రాబట్టే పనిలో ఇంటలిజెన్స్ వర్గాలు

మంథని: మావోయిస్టు పార్టీలో కీలక నేత, కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డి అలియాస్ మీసాల సత్తన్న అనారోగ్యంతో మరణించినట్లు శుక్రవారం పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. తాజా సమాచారం ప్రకారం మల్లా రాజిరెడ్డి మరణించలేదని, 2012 ఫిబ్రవరి 26న హారక్ అలియాస్ శ్రీకాంత్ పాత వీడియోనే సోషల్ మీడియాలో వైరల్ అయిందన్న వార్తలు గుప్పుమంటున్నాయి. రాజిరెడ్డి మరణంపై తీవ్ర ప్రచారం జరిగినప్పటికీ మావోయిస్టు పార్టీ నుంచి అవుననిగానీ, కాదనిగానీ ఎలాంటి ప్రకటనా రాకపోవడంతో సందిగ్ధం నెలకొంది. ఇలాంటి సమయాల్లో మావోయిస్టు పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి జగన్ ప్రకటనల ద్వారా ఎప్పటికప్పుడు స్పందిస్తుంటారు. రాజిరెడ్డి మరణించారన్న వార్త వచ్చి 36 గంటలు దాటినా మావోయిస్టులు ఎలాంటి ప్రకటనా చేయకపోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. మల్లా రాజిరెడ్డి మరణ వార్తలపై మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీకిగానీ, కేంద్ర కమిటీకిగాని స్పష్టమైన సమాచారం ఉందా..? లేదా..? అనేది మిస్టరీగా మారింది. ఈ విషయంలో ఇంటలీజెన్స్ వర్గాలు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని నిఘావర్గాలతో సమాచారం రాబట్టుతున్నట్లు సమాచారం. అయినప్పటికీ కన్ఫర్మేషన్ కావడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి.

ఓటు విలువ తెలుసుకోవాలి

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు
- మంథనిలో 5కే రన్



రన్ ప్రారంభిస్తున్న మధు, ఆర్డీఓ

మంథని: ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం కోసం ఎన్నికల కమిషన్ పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఓటు విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఐఓట్‌ఫర్‌షూర్ కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో హనుమానాయక్ ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద ప్రారంభమై.. అంబేద్కర్, పీవీ, పూలే విగ్రహాల మీదుగా కొనసాగింది. రాజ్యాంగం ప్రకారం ప్రజలకు సేవ చేసేవారే నిజమైన ప్రజాప్రతినిధి అన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈనెల 21న ఓటరు జాబితాను అందుబాటులో ఉంచుతామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, తహసీల్దార్ రాజయ్య, మంథని సీఐ ప్రభాకర్, ఎంపీడీఓ రమేశ్, మున్సిపల్ కమిషనర్ సతీశ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం



5కె రన్‌లో పాల్గొన్న కలెక్టర్



ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పెద్దపల్లిరూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధమని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ఓటరు అవగాహన 5కే రన్‌లో పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానం నుంచి అమర్‌నగర్, మసీద్ చౌరస్తా, జెండా, సుభాష్ విగ్రహం, కమాన్ మీదుగా రన్ సాగింది. కళాశాల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

కోల్‌సిటీ: ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్ అన్నారు. ఓటు వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు శనివారం కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రధాన చౌరస్తా వరకు 5కే రన్ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవడానికి ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధమన్నారు. ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేద్దామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, గోదావరిఖని వన్ టౌన్ సీఐలు ఎస్.ప్రమోద్‌రావు, ఎస్.ప్రసాద్‌రావు, కార్పొరేషన్ సూపరింటెండెంట్ మనోహర్, రెవెన్యూ, మున్సిపల్, మెప్మా, ఐసీడీఎస్ విభాగాల సిబ్బంది, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బల్దియాలో క్యూసీఐ బృందం తనిఖీ

కోల్‌సిటీ(రామగుండం): కార్పొరేషన్‌లో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(క్యూసీఐ) బృందం పర్యటిస్తోంది. పర్యటించే స్థలం, డివిజన్ల సమాచారాన్ని బల్దియా అధికారులకూ వెల్లడించడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023 పోటీలో ఉన్న రామగుండంలో పారిశుధ్యం మెరుగుపరడిన తీరుపై ఈ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తోంది. శనివారం బృందం ప్రతినిధులు భరత్, శ్రీనివాస్ పర్యటించగా.. ఆదివారం నుంచి వెంకటేశ్ అనే మరో ప్రతినిధి కూడా పర్యటించనున్నారు. ప్రతినిధులు ఎక్కడ తనిఖీ చేయాలి..? ఏ డివిజన్‌లో పర్యటించాలి..? ఏ ఇంటి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి..? ఏయే డివిజన్లలో నాలాలు, రోడ్లను తనిఖీ చేయాలి..? తదితర లొకేషన్లు, వివరాలన్నీ ఢిల్లీ నుంచి క్యూసీఐ ఉన్నతాధికారులు పంపిస్తుండగా.. ఆ ప్రకారం తనిఖీలు చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయడానికి ఉపయోగిస్తున్న డబ్బాలు, మున్సిపల్ కార్మికులు సేకరిస్తున్న తీరుపై తనిఖీ చేసి, వాటి ఫొటోలు తీసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి పారిశుధ్యం పరిస్థితి ఎలా ఉందని తెలుసుకున్నారు.

ప్రజాసేవకు ప్రాధాన్యం

- జిల్లాకేంద్రంలో ట్రాఫిక్, రూరల్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు
- రూ.200 కోట్లతో పల్లెరోడ్ల అభివృద్ధి
- ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: ప్రజాసేవకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు కనీస వసతులు కల్పిస్తున్నామని, పల్లెలకు పట్టణశోభ సంతరించేలా కోట్లాది నిధులు వెచ్చించామని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లి పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు ఇప్పటికే రూ.50కోట్లు కేటాయించామని, తాజాగా టీయూఎఫ్ఐడీసీ ద్వారా రూ.25కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. జిల్లాకేంద్రంలో ట్రాఫిక్, రూరల్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. వీలైనంత త్వరలోనే అవి ఏర్పాటవుతాయన్నారు. పెద్దపల్లి–జూలపల్లి రోడ్డు, పెద్దపల్లి–కటికనపల్లి, పోచంపల్లి నుంచి రాయపేట వరకు రోడ్ల నిర్మాణాలకు రూ.49.75కోట్లు విడుదలయ్యాయన్నారు. లింకురోడ్లకోసం రూ. రూ.45.25కోట్లు డీఎంఎఫ్‌టీ నిధులనుంచి కేటాయించారని పేర్కొన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, జెడ్పీటీసీలు రామ్మూర్తి, తిరుపతిరెడ్డి, ఎంపీపీలు సంపత్, బాలాజీరావు, రమాదేవి, మార్కెట్ చైర్మన్లు జడల సురేందర్, విండో చైర్మన్ దాసరి చంద్రారెడ్డి, తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

మండలంలోని కాపులపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

ఓదెల: ప్రభుత్వ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే దాసరి అన్నారు. ఓదెలలో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, ఆసరా, రైతుబంధు, రైతుబీమా, పింఛన్లపై ప్రజలకు వివరించాలన్నారు.

ఓటు నమోదుకు చాన్స్

- ఈనెల 26, 27న..
- తిరిగి సెప్టెంబర్ 3, 4న శిబిరాలు

సుల్తానాబాద్: ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో ఓటును సద్వినియోగం చేసుకోవాలని అధికార యంత్రాంగం సూచిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో 18 ఏళ్లు నిండిన అర్హులు ఓటుహక్కు నమోదు చేసుకునేలా ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఓటు నమోదు, మార్పులు, చేర్పుల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనుంది. ఈక్రమంలో ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితాకు కసరత్తు చేస్తోంది.

కార్యాలయాల్లో జాబితా..

ముసాయిదా జాబితాలో నియోజక వర్గాల వారీగా ఓటర్ల వివరాలను అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు జాబితాను ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో ఏర్పాటు చేయనున్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఈ నెల 26, 27 తేదీల్లో ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఆన్‌లైన్‌లో ఎన్‌వీఎస్‌పీ (నేషనల్ ఓటర్ సర్వీసు పోర్టల్), వీహెచ్ఏ (ఓటరు హెల్ప్‌లైన్ అప్లికేషన్) ద్వారా దరఖాస్తు చేయవచ్చు. బూత్ స్థాయి అధికారులు, తహసీల్దార్ కార్యాలయం, ఈఆర్వోకు నేరుగా దరఖాస్తు అందించవచ్చు.



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తప్పులు సరిచేసుకునే అవకాశం

ఈ నెల 26, 27 తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. రెండు రోజులు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక బీఎల్‌వో (అంగన్‌వాడీ టీచర్లు, బూత్‌స్థాయి అధికారి) అందుబాటులో ఉంటారు. 2023 అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోని వారికి ఫారం–6, ఇతర ప్రాంతానికి శాశ్వతంగా వెళ్లినవారి పేరు, చనిపోయిన వారి పేరు తొలగించేందుకు ఫారం–7, జాబితాలో పేరు ఉండి సెల్, ఇంటి నంబరు, తల్లి, తండ్రి పేర్లతో పాటు ఇంకా ఏవైనా తప్పులు ఉంటే సరి చేసుకునేందుకు ఫారం–8 బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉంటాయి. కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్, డేట్ ఆఫ్ బర్త్‌కు సంబంధించిన ఎస్సెస్సీ మార్కుల జాబితా వెంట తీసుకెళ్లాలి. మార్పులు చేర్పులు చేసుకునే వారు సంబంధించిన ఏదైనా ధ్రువపత్రం తీసుకెళ్లాలి.

అక్టోబరు 4న తుది జాబితా

సెప్టెంబర్ 2, 3 తేదీల్లో కూడా బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉంటారు. వారి వద్ద ఉండే ఓటరు జాబితాను పరిశీలించుకోవచ్చు. ఏదైనా కారణంతో పేరు లేకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబరు 4న ఓటరు తుది జాబితా విడుదల చేస్తారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	ఇతరులు	మొత్తం
పెద్దపల్లి	1,23,050	1,22,716	8	2,45,774
మంథని	1,09,033	1,11,691	7	2,20,731
రామగుండం	1,05,301	1,23,050	26	228,377

పోలింగ్ బూత్‌లు

పెద్దపల్లి	290
మంథని	288
రామగుండం	258

సద్వినియోగం చేసుకోవాలి



ఎన్నికల కమిషన్ ఇచ్చిన అవకాశాన్ని వయోజనులు ఓటు హక్కు నమోదు కోసం సద్వినియోగం చేసుకోవాలి. అభ్యంతరాలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఓటర్ జాబితాపై ఇవ్వవచ్చు. నిరభ్యంతరంగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

– శ్యాంప్రసాద్‌లాల్, అదనపు కలెక్టర్

క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మిగిలి ఉన్న సీట్ల కోసం (మూడో విడత) విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని, వీలైనంత ఎక్కువ ట్రేడ్లు, ఐటీఐలో ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ట్రినిటీ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్–14, అండర్–16లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన శివకుమార్, రాంచరణ్, అక్షరను మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అభినందించారు. ప్రిన్సిపాల్ రహీం, రమేశ్, మహేందర్, భూపతి, కిశోర్, వెంకటేశ్ తదితరులున్నారు.

28న యూపీఎస్సీ సీఎస్ఏటీ పరీక్ష

పెద్దపల్లిరూరల్: ఈనెల 28న యూపీఎస్సీ సీఎస్ఏటీ కోచింగ్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మెహరాజ్ మహ్మద్ తెలిపారు. రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కోచింగ్‌కు 100 మంది మైనార్టీ అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. హైదరాబాద్‌లోని మైనార్టీస్ స్టడీ సర్కిల్ లో తొలి సారి ప్రవేశం పొందే వారంతా పరీక్షకు హాజరుకావాలని సూచించారు. పరీక్ష ఈనెల 28న సాయంత్రం నాలుగు నుంచి 6గంటల వరకు జిల్లా కేంద్రంలోని రంగంపల్లి మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో ఉంటుందని, వివరాలకు 040–23236112లో పనిదినాలలో సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ టీచర్లకు చట్టాలపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి రైతుభవనంలో అంగన్‌వాడీ టీచర్లకు చట్టాలు, సెక్షన్‌లపై రెండురోజులపాటు అవగాహన కల్పించారు. ఐటీపీఏ యాక్ట్‌లోని సెక్షన్స్, పోక్సో యాక్ట్‌లోని సెక్షన్లు, బాల్యవివాహాల చట్టంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజ్వల సంస్థ సీనియర్ కో–ఆర్డినేటర్ చంద్రయ్య, సీడీపీవో కవిత, సూపర్‌వైజర్‌లు బ్లాండీనా, లక్ష్మి, భాగ్యలక్ష్మి, సర్పంచు కారుపాకల రాజయ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఈ–పంచాయతీ సేవలు అందేదెప్పుడో..?

- ఇంకా పల్లెలకు చేరని కంప్యూటర్లు
- వచ్చిన పంచాయతీల్లో అటకెక్కిన ఫైనం
- మండలకేంద్రాలనుంచే ఆన్‌లైన్ సేవలు





పెద్దపల్లిరూరల్: పల్లె ప్రజలకు స్థానికంగానే పారదర్శకవంతమైన సేవలు అందించేందుకు వీలుగా రూపొందించిన ఈ–పంచాయతీ సేవలు అందడంలేదు. ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం గ్రామీణ ప్రాంత ప్రజలకు పంచాయతీ ఆఫీసుల వద్దనే సేవలు అందేలా చేపట్టిన కార్యాచరణ ముందుకు సాగడంలేదు.

మూలకు పడిన కంప్యూటర్లు

జిల్లాలో 266 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీఆటిలో 139 పంచాయతీలకే కంప్యూటర్లు అందించారు. పంచాయతీ పరిధిలో ఇంటి అనుమతులు మొదలు పన్నుల వసూలు తదితర వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే అవసరమైనన్ని కంప్యూటర్లు అందుబాటులో లేకపోవడం, ఇంటర్నెట్ సౌకర్యం ఇంకా పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఈ–పంచాయతీ సేవలు అందడంలేదు.

అందుబాటులోకి వస్తేనే మేలు

ఈ–పంచాయతీ పాలన అందుబాటులోకి వస్తేనే ప్రజలకు మేలు కలుగుతుంది. తమకు అవసరమైన సేవలను స్థానికంగానే వేగంగా పొందేందుకు అవకాశముంటుంది. ఇంటి నిర్మాణానికి అనుమతుల కోసం, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాల కోసం పంచాయతీ ఆదాయ వ్యయాలకు సంబంధించి వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు వీలుంటుంది. కార్యదర్శులకు కరువైన శిక్షణపంచాయతీలలో ఆన్‌లైన్ సేవలందించాలంటున్న అధికారులు అక్కడ పనిచేసే పంచాయతీ కార్యదర్శులకు కనీస శిక్షణ ఇప్పించడంపై దృష్టి సారించడంలేదు. మండల పరిషత్ కార్యాలయాలకే పంచాయతీల నుంచి కంప్యూటర్లు తెప్పించి అక్కడే ముగ్గురు ఆపరేటర్లను నియమించుకుని అన్ని పంచాయతీల ఆన్‌లైన్ పనులు సాగిస్తున్నారు.

పనులన్నీ ఆన్‌లైన్‌లోనే..

పంచాయతీలకు సంబంధించిన వ్యవహారాలన్నీ ఆన్‌లైన్‌లోనే సాగుతున్నాయి. పంచాయతీ కార్యాలయాల నుంచే సేవలను అందించేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నాం. చాలవరకు పంచాయతీలకు టిఫైబర్ నెట్‌ను అనుసంధానిస్తున్నారు. ఇంకా కొన్ని పంచాయతీలకు కంప్యూటర్లు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి కంప్యూటర్లు అందగానే అన్ని పంచాయతీల వద్దనుంచే ఆన్‌సేవలను ప్రజలకు అందిస్తాం.

– చంద్రమౌళి, డీపీవో

బొగ్గుబాయి వార్తలు

హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి



కాంట్రాక్ట్ కార్మికులతో చర్చిస్తున్న యాదగిరి సత్తయ్య

రామగిరి: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆర్జీ–3 డివిజన్ ఓసీపీ–2లో కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం బీఎంఎస్‌తో మాత్రమే సాధ్యమన్నారు. ఇచ్చిన హామీలను యాజమాన్యం అమలు చేయాలని, కోల్‌ఇండియాలో తరహాలో హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి మంద రమకాంత్, ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు అర్కాల ప్రసాద్ గౌడ్, మామిడి స్వామి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న జీఎంకు సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 జీఎం మనోహర్ మందమర్రి జీఎంగా బదిలీ అయ్యారు. ఆయనను జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శాలువాలతో సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం సలీం, ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న సన్నిధిలో విచారణ



విచారణ జరుపుతున్న ఏడీసీ కృష్ణవేణి

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి హుండీ ఆదాయాన్ని ఈనెల 9న లెక్కించిన విషయం విదితమే. ఈ సమయంలో చైర్మన్ తిరుకోవెళూర్ మారుతీస్వామి బంగారు లేదా వెండి ఆభరణాలు తీశారని ఆరోపిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు ఆలయ బోర్డు సభ్యుడు జున్న సురేందర్, ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈమేరకు దేవాదాయ శాఖ ఏడీసీ కృష్ణవేణి శనివారం కొండగట్టుకు చేరుకున్నారు. హుండీ ఆదాయం లెక్కించిన పరిసరాలు పరిశీలించారు. పోలీస్ ఔట్‌పోస్ట్‌కు వెళ్లి సీసీ ఫుటేజీలు తనిఖీ చేశారు. వాటిని పెన్‌డ్రైవ్‌లోకి కాపీ చేసుకున్నారు. ఈసందర్భంగా తిరుకోవేళూర్ మారుతీస్వామి, ఫిర్యాదుదారు, బోర్డు సభ్యుడు జున్న సురేందర్, బోర్డు సభ్యుడు వోల్లాల లింగాగౌడ్, అర్చకులు పెద్ద జితేంద్రప్రసాద్ స్వామి, చిరంజీవస్వామి, కపిందర్ నుంచి వాంగ్మూలాలు సేకరించారు. అయితే, దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు హుండీ ఆదాయం లెక్కింపు సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై విచారణ జరిపామని, నివేదికను కమిషనర్‌కు అందజేస్తామని కృష్ణవేణి తెలిపారు. కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, కొండగట్టు ఆలయ ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యానికి జూడో దోహదం

- క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణిస్తారు
- రాష్ట్రస్థాయి జూడోపోటీలను ప్రారంభించిన కలెక్టర్ గోపి
- 280మంది క్రీడాకారులు, 30మంది రెఫరీలు హాజరు



జూడో క్రీడాకారులతో కరీంనగర్ కలెక్టర్ గోపి, తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: ప్రస్తుతకాలంలో విద్యార్థుల ఆత్మస్థైర్యానికి జూడో క్రీడ దోహదపడుతుందని కలెక్టర్ బి.గోపి అన్నారు. కరీంనగర్‌లోని మానేరు ఉన్నత పాఠశాలలో జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ రాష్ట్రస్థాయి జూనియర్స్ జూడో చాంపియన్‌షిప్ పోటీలను శనివారం రాత్రి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడలకు ఆదరణ పెరుగుతోందని అన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. కొన్నేళ్లుగా రాష్ట్ర, జాతీయస్థాయి జూడో పోటీలను నిర్వహిస్తున్న మానేరు విద్యాసంస్థలను అభినందించారు. మైత్రి గ్రూప్స్ చైర్మన్ కొత్త జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ఫుట్‌బాల్ తరువాత అత్యంత ప్రజాదరణ ఉన్న క్రీడ జూడో అన్నారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. మానేరు విద్యాసంస్థల అధినేత, జిల్లా జూడో సంఘం అధ్యక్షుడు కడారి అనంతరెడ్డి, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలకు తెలంగాణవ్యాప్తంగా సుమారు 280మంది క్రీడాకారులు, 30మంది కోచ్‌లు, మేనేజర్లు, రెఫరీలు హాజరైనట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తెలంగాణ జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. బంగారు పతకం సాధించినవారిని ఈనెల 28నుంచి సెప్టెంబర్ 1వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ గోపి పోటీలను ప్రారంభించారు. డీవైఎస్ఓ కీర్తి రాజవీరు, భారత జూడో సమాఖ్య కోశాధికారి బి.కైలాస్‌యాదవ్, జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్‌రెడ్డి, జిమ్నాస్టిక్స్, సైక్లింగ్ క్రీడా సంఘాల అధ్యక్షులు నిరంజనాచారి, మధుసూదన్‌రెడ్డి, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మహాసభల పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న సీతారామయ్య

గోదావరిఖని: ఏఐటీయూసీ 16వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను యూనియన్ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య శనివారం విడుదల చేశారు. స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ 16వ మహాసభలు గోదావరిఖనిలో ఈనెల 25 నుంచి 27 వరకు జరుగుతాయని, మహాసభలకు కార్మికవర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కె.స్వామి, గౌతం గోవర్ధన్, రంగు శ్రీనివాస్, తాల్లపెల్లి మల్లయ్య, శనగల శ్రీనివాస్, మానాల శ్రీనివాస్, చెప్యాల భాస్కర్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సైబర్ మోసం రూ.7.67 లక్షలు మాయం

- టెలిగ్రామ్ లింక్ పేరుతో ఆన్‌లైన్ మోసం
- మోసపోయిన స్తంభంపల్లి యువకుడు
- అత్యాశకు పోవద్దు : ఎస్సై మహేందర్

బోయినపల్లి(చొప్పదండి): అత్యాశకు పోయి రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లికి చెందిన యువకుడు రూ.7.67లక్షలు పోగొట్టుకున్నాడు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాలు. స్తంభంపల్లికి చెందిన అక్కెనపెల్లి హరీశ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ మెడికల్ బయోటెక్నాలజీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో వచ్చిన మెస్సేజ్‌తో టెలిగ్రామ్ లింక్ ఓపెన్ చేశాడు. మొదట యూట్యూబ్ ద్వారా కొన్ని వీడియోలు పంపితే నెలకు రూ.3వేలు ఇస్తామని చెప్పడంతో అలా చేశాడు. కొద్ది రోజులకు యాప్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే రెట్టింపు అవుతాయని నమ్మబలకడంతో ఈనెల 9, 10, 11 తేదీలలో ఫోన్‌పే, గూగూల్‌పే ద్వారా వారు చెప్పిన నంబర్లకు రూ.7.67లక్షలు పంపించాడు. చివరికి యాప్ ఫేక్ అని తెలుసుకొని 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. ఎస్సై మహేందర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని, అత్యాశకు పోయి ఆన్‌లైన్‌లో డబ్బులు పెట్టి మోసపోవద్దని హెచ్చరించారు.

వేతన ఏరియర్స్ వెంటనే చెల్లించాలి

గోదావరిఖని: 11వ వేతన ఒప్పందమై నాలుగు నెలలు పూర్తవుతున్నా ఏరియర్స్ చెల్లించడంలో యాజమాన్యం జాప్యం చేస్తోందని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు ఆరోపించారు. కోల్ ఇండియాలో 23 నెలల ఏరియర్స్ కోసం ఆగస్టు నెల జీతాలతో సెప్టెంబర్ మూడున చెల్లించాలని సర్కులర్ జారీ చేశారని, రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు సకాలంలో ఇవ్వకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. 2022–23లో దాదాపు రూ.2,222కోట్ల లాభం ఆర్జించి చరిత్ర సృష్టించిన సింగరేణి ఉత్పత్తి, ఉత్పాదకతలో అవార్డు సాధించిన సంస్థకు ఆర్థిక ఇబ్బందులు రావడం బాధాకరమన్నారు. అధికారులు ఏరియర్స్‌పై సర్క్యులర్ జారీ చేయాలన్నారు.

వాట్సాప్ ఫేక్ చాట్ క్రియేట్ చేసిన వ్యక్తులపై చర్యలు

మంథని: బీజేపీ మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, రామగిరి మండలానికి చెందిన మరో ముగ్గురికి గుర్తు తెలియని ఫోన్ నంబర్ నుంచి వచ్చిన ఆడియో రికార్డు, సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని మంథని సీఐ సతీశ్ తెలిపారు. బీజేపీకి చెందిన సునీల్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడిన వాయిస్ రికార్డ్ పెట్టినట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాయిస్ రికార్డ్ క్రియేట్ చేసిన, రెండు గ్రూపుల గొడవకు దిగేలా పోస్ట్ చేసిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరో కావాలనే ఫేక్ ఆడియో, మెసేజ్‌లు క్రియేట్ చేసి ఒక వ్యక్తి గౌరవ మర్యాదలకు భంగం కలిగించేలా.. రెండు గ్రూపుల మధ్య గొడవలు సృష్టించేలా చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే చందర్‌పై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టింగ్‌లు చేసిన వారిపై చర్య తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జాహిద్‌పాషా, కో–ఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫీ, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు పొలాడి శ్రీనివాసరావు, మున్వర్, మీర్ ఫయాజ్‌అలీ, సాయికుమార్ గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇద్దరు బీజేపీ నాయకులపై కేసు నమోదు

చందర్‌పై సోషల్‌మీడియాలో ఇరువర్గాలను రెచ్చగొట్టేలా ఫొటోలు మార్ఫింగ్ చేసి తప్పుడు పోస్టింగ్ చేసిన బీజేపీ నాయకులు పిడుగు క్రిష్ణ, కల్వల రంజిత్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై తెలిపారు. బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సమ్మయ్య పేర్కొన్నారు.

ఐకమత్యంతోనే రాజకీయ మనుగడ



జూలపల్లిలో మాట్లాడుతున్న రాజేందర్ యాదవ్

జూలపల్లి: యాదవులు ఐకమత్యంగా ఉంటేనే అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇస్తాయని అఖిల భారత యాదవ సభ జిల్లా అధ్యక్షుడు సందెనవేని రాజేందర్‌యాదవ్ అన్నారు. మండలకేంద్రంలో నిర్వహించిన మండలస్థాయి యాదవ మహాసభ సమావేశంలో మాట్లాడారు. పెద్దపల్లి నియోజకవర్గంలో యాదవులు అధికంగా ఉన్నందున సీటు కేటాయించాలని పార్టీలను కోరారు. యాదవ సభ ను ఏర్పాటు చేసి వందేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాకేంద్రంల ఈ నెల 23న ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహయాదవ్ తెలిపారు. ముందుగా పలువురు నాయకులను సన్మానించారు. ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ధర్మారం: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు, ఓదెల జెడ్పీటీసీ గంట రాములు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చే కమ్యూనిటీ భవనాలకో.. గొర్రెలకో ఓట్లు అమ్ముకోవద్దన్నారు. అసెంబ్లీ ఎన్నికలతోపాటు జెడ్పీటీసీ, ఎంపీపీ పదవుల్లో యాదవులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మండల అధ్యక్షుడు ఆవుల ఎల్లయ్యయాదవ్, సంఘం జిల్లా కార్యదర్శి వేల్పుల నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

కౌశిక హరిని కలిసిన ఎమ్మెల్యే చందర్



కౌశిక హరి ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: త్వరలో కారెక్కనున్న కౌశిక హరిని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శనివారం కలిశారు. ఆయన ఇంటికి వెళ్లి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. తనను కలిసిన ఎమ్మెల్యేను హరి శాలువాతో సన్మానించారు. నగర డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు కౌశిక లత, పెంట రాజేశ్, నాయకులు జేవీ.రాజు, బొడ్డుపల్లి శ్రీనివాస్, రాజుగౌడ్ తదితరులున్నారు.

అనారోగ్యంతో ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు మృతి



కొమురయ్య(ఫైల్)

జ్యోతినగర్: అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుడు దామెర కొమురయ్య(54) మృతి చెందారు. స్థానిక అన్నపూర్ణకాలనీకి చెందిన కొమురయ్య ప్రాజెక్టులోని యూనిట్–7 ఆపరేషన్ విభాగంలో హౌజ్‌కీపింగ్ విధులు నిర్వహిస్తారు. ఈనెల 12న అస్వస్థతకు గురికావడంతో తోటి కార్మికులు పీటీఎస్‌లోని ధన్వంతరి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. శుక్రవారం రాత్రి మరోమారు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమారుడు సుదీప్, కేమార్తె స్పందన ఉన్నారు. మృతదేహాన్ని పలువురు కార్మిక సంఘాల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఆరు గంటలు ఆలస్యం



తెలంగాణ ఎక్స్‌ప్రెస్

రామగుండం: హైదరాబాద్–న్యూఢిల్లీ మధ్య నడిచే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం ఆరు గంటల ఆలస్యంగా నడిచింది. రామగుండంకు మధ్యాహ్నం 12.32 గంటలకు చేరాల్సి ఉండగా.. సాయంత్రం ఆరు గంటలకు వచ్చింది. నాగపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో షార్ట్‌సర్క్యూట్ అయి బోగీలకు మంటలు అంటుకున్నాయని, దీంతో రైళ్ల రాకపోకలు ఆలస్యమైందని రైల్వే అధికారులు చెబుతున్నారు. రైలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

భార్యపై దాడిచేసిన భర్త అరెస్టు

కరీంనగర్‌రూరల్: భార్యపై శుక్రవారం కత్తితో దాడి చేసిన భర్తపై శనివారం కరీంనగర్‌రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కు చెందిన బాకారపు రవి కూతురు గౌతమికి దుర్శేడ్‌కు చెందిన ఇట్టవేని శ్రీకాంత్‌తో 2016లో వివాహమైంది. ఇద్దరు కుమారులుండగా గుంటూరుపల్లెలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గౌతమి టీచర్‌గా పనిచేస్తోంది. కొన్నిరోజుల నుంచి శ్రీకాంత్ ఎలాంటి పనిచేయకుండా, మద్యం తాగి వచ్చి భార్య, పిల్లలను వేధిస్తున్నాడు. 13న శ్రీకాంత్ కొట్టడంతో గౌతమి పిల్లలతో తల్లిగారింటికి పోయింది. కరీంనగర్ నుంచి గుంటూరుపల్లెలోని పాఠశాలకు వచ్చి పనిచేస్తున్న గౌతమిపై శుక్రవారం మధ్యాహ్నం శ్రీకాంత్ కత్తితో దాడి చేయడంతో పలుచోట్ల గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బ్లూకోల్ట్స్' పోలీసులు వెంటనే గౌతమిని చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతుంది. శనివారం గౌతమి తండ్రి రవి ఫిర్యాదు మేరకు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాలికను బెదిరించిన ఇద్దరి అరెస్ట్

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని ఓ బాలికను లైంగికంగా వేధించిన రశీదాతోపాటు గడ్డం హన్మాండ్లును శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు. పని ఇప్పిస్తామని బా లికను కొన్ని రోజుల క్రితం వెంకట్రావ్‌పేట శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లారని, అక్కడ హన్మాండ్లు బాలికను లైంగికంగా వేధించాడని పేర్కొన్నారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.